ప్రజాశక్తి

సోమవారం 27 మే 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా







పరీక్ష హాలులోకి వెళుతున్న విద్యార్థులు

ప్రశాంతంగా జెఇఇ అడ్వాన్స్డ్ పరీక్ష

94 శాతం మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

ఐఐటిల్లో ప్రవేశానికిగాను ఆదివారం జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) – 2024 అడ్వాన్స్డ్ పరీక్ష నగరంలో ప్రశాంతంగా జరిగింది. నగరంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మొత్తం 12 వేల మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 94 శాతం మంది హాజరయ్యాయి. పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరిగింది. మొదటి పరీక్ష ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో పరీక్ష మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగింది. పరీక్ష సందర్భంగా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లూ చేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువులతో పరీక్షా కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. ఒక్క నిమిషం నిబంధన అమలులో ఉండటంతో విద్యార్థులను అరగంట ముందుగానే పరీక్ష హాల్లోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిబంధనలను అనుసరించి విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి పంపారు.



విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడుతున్న పరీక్షా కేంద్రం

మత్స్యకార భరోసా ఎప్పుడు?

- సముద్రంలో వేట నిషేధించి 40 రోజులైనా అందని సాయం
- 2,204 బోట్లకు సంబంధించి 12,813 మంది లబ్ధిదారులుగా గుర్తింపు !

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

చేపల వేట నిషేధ భృతి విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వేట నిలిచిపోయి 40 రోజులు దాటినా ఇప్పటికీ మత్స్యకారులకు భృతి విడుదల కాలేదు. దీంతో రోజువారీ రెక్కాడితేగానీ డొక్కాడని మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మరోపక్క ప్రాథమికదశలో పూర్తయిన ఎన్యుమరేషన్ ఎన్‌రోల్‌మెంట్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు మత్స్యకారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

కృష్ణాజిల్లా కృత్తివెన్ను, మచిలీపట్నం, కోడూరు, నాగాయలంక మండలాల పరిధిలో 101 కిలో మీటర్ల మేర సముద్రతీర ప్రాంతం విస్తరించి ఉంది. అత్యధిక సంఖ్యలోని తీర ప్రాంత గ్రామాల్లోని వేలాది మత్స్యకార కుటుంబాలు సముద్ర వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ఒక్కో మెకనైజ్డ్ బోటుపై ఆరు నుంచి ఎనిమిది మందితో కూడిన బృందం సముద్రంలో వేటకు వెళుతుంది. అలా వేటకు వెళ్లిన రోజుల్లో మత్స్యకారులకు ఒక్కొక్కరికి సగటున రూ.800 నుంచి రూ.1,200 వరకు ఆదాయం వస్తుంది. ఈ నేపథ్యంలో సముద్ర ఉత్పత్తుల వృద్ధికి ప్రతి ఏటా ఏప్రిల్ 15 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు 61 రోజులపాటు ప్రభుత్వాలు సముద్రంలో వేటపై నిషేధం విధించాయి. ఈ నిషేధం కారణంగా ఉపాధి కోల్పోతున్న మత్స్యకార కుటుంబాలను ఆదుకోవడానికి ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ మత్స్యకార భరోసా అందిస్తోంది. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఇస్తోంది. ఎన్నికల కోడ్ ఉండటంతో ఈ సీజన్లో ఎన్యుమరేషన్ ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో సంబంధిత లబ్ధిదారులకు పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో వేట ద్వారా జీవనం సాగించే కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.

ప్రాథమిక నివేదికలోనూ అవకతవకలు ?

వేట నిషేధం కారణంగా భృతి కోల్పోయిన మత్స్యకార్మికులను మత్స్యశాఖ జిల్లా యంత్రాంగం గుర్తించి వారి పేర్లను నమోదు చేయాలి. దీనికి సంబంధించి ప్రాథమిక దశ నివేదికను అధికారులు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. 2,204 బోట్లకు సంబంధించి 12,813 మందికి మత్స్యకార భరోసా ఇవ్వాల్సి ఉంటుందని నివేదికను ప్రభుత్వానికి అందించినట్లు తెలిసింది. ఈనివేదికను సచివాలయాల్లో ప్రదర్శించి సోషల్ ఆడిట్ పూర్తయిన తర్వాత తుది నివేదిక ఆధారంగా భృతి కోల్పోయిన వారికి భరోసా చెల్లిస్తారు. అయితే ప్రాథమిక దశలోనే భరోసా ఎన్యుమరేషన్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవంగా వేటకు వెళ్లే మత్స్యకారులను పక్కనపెట్టి బోటు యజమానులు చెప్పిన వారి పేర్లు నమోదు చేశారని తీర ప్రాంత గ్రామాల్లో చర్చ జరుగుతోంది. ఒక్కో బోటుకు బోటు యజమానుల బంధువులు, కుటుంబ సభ్యులు పేర్లు మూడు, మిగిలిన మూడు పేర్లు వారికి అనుకూలంగా ఉన్న మత్స్యకార్మికుల పేర్లను నమోదు చేయించారనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో అర్హులైన అందరికీ త్వరగా మత్స్యకార భరోసా ఇవ్వాలని వాస్తవ మత్స్యకార్మికులు కోరుతున్నారు.



వేటపై నిషేధంతో మచిలీపట్నం మండలం గిలకలదిండిలో నిలిచిన బోట్లు

కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది
వాటపల్లి నాంచారయ్య, గిలకలదిండి, మచిలీపట్నం మండలం

వేటకు వెళితేనే మా కుటుంబానికి పూటగడుస్తుంది. 40 రోజులుగా వేట నిలిచిపోయింది. ప్రభుత్వం ఇచ్చే భరోసా రూ.10 వేలు ఇవ్వలేదు. రోజువారీ కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది.

మత్స్యకార భరోసా విడుదల చేయాలి
పి.చక్రవర్తి, ఏటిపవర్, కృత్తివెన్ను మండలం

మత్స్యకారుల కుటుంబాలకు వేటే ఆధారం. వేట నిలిచిపోయిన వెంటనే ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక సాయం కుటుంబాల పోషణకు ఉపయోగపడుతుంది. అయితే మత్స్యకార భోరోసా విడుదలలో జాప్యం జరగడంతో అవస్థలు పడుతున్నాం. వెంటనే వైఎస్ఆర్ మత్స్యకార భరోసా విడుదల చేయాలి.

అర్హులందరికీ ఇవ్వాలి : కొప్పనాతి తాతయ్య, ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా బాధ్యులు

వైఎస్ఆర్ మత్స్యకార భరోసా ఎన్యుమరేషన్లో అవకతవకలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. సముద్ర వేటకు వెళ్లే మత్స్య కార్మికులందరి పేర్లను జాబితాలో నమోదు చేయాలి. అర్హులందరికీ భృతి చెల్లించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

నేటి నుండి హజ్ యాత్రకు విమానాలు

ప్రజాశక్తి - గన్నవరం : ఈ ఏడాది హజ్ యాత్రకు మొదటి విమానం సోమవారం ఉదయం 8:45 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరుతుందని హజ్ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. తెల్లవారుజామున 3.30 గంటలకు గన్నవరం ఈద్గా జామ మసీదు హజ్ క్యాంపు వద్ద నుండి ఈ యాత్ర వెళ్లే వారితో బస్సులు విమానాశ్రయానికి బయలుదేరుతాయని తెలిపారు. ఈబస్సులకు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి, చైర్మన్ హజ్ ఆపరేషన్స్ హర్షవర్ధన్ పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. వక్ఫ్‌బోర్డ్ సిఇఒ, హజ్ కమిటీ ఇఒ అబ్దుల్ ఖదీర్, హజ్ కమిటీ సభ్యులు, దూదేకుల కార్పొరేషన్ ఎమ్‌డి.గౌస్ పీర్, డైరెక్టర్, ఉర్దూ అకాడమీ, సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ అలీమ్ భాష హజ్ క్యాంపులో యాత్రికులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 692 మంది హజ్ యాత్రకు నమోదు చేసుకున్నారని, 322 మందితో మొదటి విమానం గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరుతుందని తెలిపారు. ంండో విమానం ఈనెల 28వ తేదీ సాయంత్రం 4.55 గంటలకు 322 మందితో, మూడో విమానం ఈనెల 29వ తేదీ ఉదయం 7.10 గంటలకు 48 మందితో గన్నవరం విమానాశ్రయం నుంచి జెడ్డాకు బయలుదేరతాయని తెలిపారు. హజ్ శిబిరం నుండి విమానాశ్రయానికి ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



యోగాతో ఏకాగ్రత

జెసి డాక్టర్ సంపత్ కుమార్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మానవ శరీరంలో సర్వ శక్తులను ఏకం చేసి ఏకాగ్రత సాధించేందుకు యోగా దోహదం చేస్తుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయం యోగాకు కేటాయిస్తే ఆరోగ్య వంతంగా జీవిస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి .సంపత్ కుమార్ అన్నారు. అమరావతి యోగా, యోరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన వేసవి ఉచిత యోగా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధి గా పాల్గొని ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం జెసి మాట్లాడుతూ ప్రాచీన పూరాతన కాలం నుండే యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరోగ్యకర జీవితానికి శరీరం మనస్సుల మధ్య సమతౌల్యానికి యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రపంచ మానవాలికి గొప్ప వరం యోగా అని, మారుతున్న ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురై ఆనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా చిన్నారులు ఉదయం సాయంత్రం టివి సెల్ ఫోన్లు చూస్తూ అలసత్వానికి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి యోగా, యోరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు చలసాని అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు మిరియాల వెంకటేశ్వరరావు, సిహెచ్ అరుణ్ కుమార్ ఎమ్‌డి.ఇక్బాల్, కోశాధికారి లావణ్య కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీస్ కె.గాంధీ బాబు, కొనకల్ల రెడ్డమ్మ, పిల్లి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న జెసి డాక్టర్ పి.సంపత్‌కుమార్

ఓట్ల లెక్కింపు బందోబస్తుకు ప్రత్యేకాధికారుల నియామకం

కృష్ణాజిల్లాకు లావణ్య లక్ష్మి, ఎన్‌టిఆర్ జిల్లాకు సోమన్న

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు సమయంలో హింసాత్మక ఘటనలు జరగకుండా అన్ని జిల్లాలకు స్పెషల్ పోలీసు ఆఫీసర్లను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఎన్నికల సంఘం ఆదేశం మేరకు కష్ణా జిల్లాకు చిత్తూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి లావణ్య లక్ష్మిని రాష్ట్ర డిజిపి నియమించారు. అలాగే విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు సిఐడి డిఎస్‌పి సోమన్నను నియమించారు.

యువ చిత్రకారిణి సింధూశ్రీకి బెస్ట్ అవార్డు



ప్రజాశక్తి - విజయవాడ : నగరానికి చెందిన ప్రముఖ యువ చిత్రకారిణి మేడా సింధూశ్రీకి చిత్రలేఖనం, క్రియేటివ్ క్రాఫ్ట్ విభాగంలో బెస్ట్ నంది అవార్డు, టాలెంట్ అవార్డు కైవసం చేసుకుంది. రితిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవార్డు ఫంక్షన్‌లో ఆమె ఈ అవార్డులు అందుకుంది. హోప్ విన్ హాస్పిటల్ డాక్టర్ షమా సుల్తానా, కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ నుంచి డాక్టర్ కొమరగిరి రాఘవరావు, లిటిల్ బ్లాక్‌స్టార్ విజువల్ ఎఫెక్ట్స్ కో ఫౌండర్ తిరుమలశెట్టి మేఘన, రితిక ఫౌండేషన్ చైర్మన్ పి.నిత్యాచారి ఆమెకు ఈ అవార్డులను బహూకరించారు.

విద్యార్థులతో పుస్తక పఠనం



ప్రజాశక్తి - విజయవాడ : సత్య నారాయణ పురంలోని చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో భాగంగా ఆదివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పుస్తక సమీక్షలు, నీతి కథలు చదివించారు. అనంతరం రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ టి సుబ్బన్న గణితంలో, టీచర్ కె.కనక దుర్గాదేవి మోరల్ వాల్యూస్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్ పాల్గొన్నారు.




యోగాలో శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : స్ఫూర్తి కుటుంబం ఆంధ్ర ప్రదేశ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బందర్ రోడ్‌లోని ఠాగూర్ మెమోరియల్ గ్రంథాలయంలో ఆదివారం యోగా టీచర్ ప్రభాకర్, యోగ ప్రదర్శనకారుడు గుణశేఖర్ విద్యార్థులకు యోగా శిక్షణ ఇచాచరు. ఈ కార్యక్రమంలో రైల్వే జూనియర్ మహిళా కాలేజీ రిటైర్డు అధ్యాపకురాలు కాదంబరి జ్యోతి, స్ఫూర్తి కుటుంబం ట్రస్టీ చొప్పరపు నారాయణ రావు, గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి పాల్గొన్నారు.

సత్యనారాయణపురం పరిధిలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - విజయవాడ : సత్యనారాయణపురం సిఐ, ఎస్ఐ ఆధ్వర్యాన శనివారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ పోలీస్ స్టేషన్ ఏరియాలో గల కుద్దూష్ నగర్, మట్టి రోడ్ ఏరియాలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.





గన్నవరంలో అద్దెల మోత

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరంలో భవనాల అద్దెలు మోత మోగుతున్నాయి. రాజధాని నేపథ్యంలో ఇంటి అద్దెలు మరింత పెరిగిపోయాయి. సామాన్య, మధ్యతరగతి వారు హడలిపోతున్నారు. గత మూడు నెలల క్రితం రేకుల షెడ్డు ఇంట్లో రెండు గదులకు అద్దె వెయ్యి నుంచి 1200 రూపాయలు తీసుకునే వారు. భవనాల్లో అద్దె రూ.2,500నుంచి రూ.3 వేలు వరకు ఉండేది. పూరిళ్లలో అద్దె రూ.300 నుంచి రూ.500 ఉండేది. దీంతో సామాన్య, మధ్యతరగతి వారు అద్దెకు ఉండటానికి ఇబ్బంది పడే వారు కాదు. సంపాదించిన దాంట్లో అద్దెలు కట్టుకుని ఇబ్బందులు లేకుండా ఉండేవారు. రాజధానితో పాటు విమానాశ్రయానికి జాతీయ హెూదా ప్రకటించడంతో అపార్టుమెంట్లు అధికం గా కడుతున్నారు. ఇళ్ల అద్దెలు ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లాయి. ఇళ్లను అద్దెకు తీసుకునేందుకు ఉద్యోగులు ఎగబడటంతో యజమానులు అద్దెలు పెంచేస్తున్నారు. నూతనంగా కట్టిన అపార్టుమె ట్లు, భవనాల్లో ఆధునిక వసతులు కల్పించి మరీ అద్దెలు పెంచి వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం అద్దెలు రేకుల షెడ్లులో రెండు గదలుకు రూ.3 వేలు, భవనాల్లో ఒక పార్టన్కి రూ.4 వేల నుం చి 5 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. అపార్టుమెంట్లలో రూ.6 వేల నుంచి రూ.8 వేలు తీసుకుంటున్నారు. మూడు బెడ్రూమ్స్ ఇల్లైతే రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. ఈవిధం గా అద్దెలు తారా స్థాయికి వెళ్తుండటంతో సామాన్యులు, కార్మికులు పట్టణంలో ఉండటానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో గన్నవరానికి కొంత దూరంలో ఉన్న వెంకట నరసింహాపురానికి వెళ్తున్నారు. నూతన భవ నాల యజమానులు అద్దెలు గట్టిగా వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్నారు. గన్నవరంలో 69 వరకు అపార్టుమెంట్లు ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది కొత్తగా 120 భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. భరించలేని విధంగా పెరుగుతున్న అద్దెలతో జనాలు నానా అగచాట్లు పడుతున్నారు.

అద్దె నియంత్రణ చట్టం ఎక్కడా?

రాష్ట్ర ప్రభుత్వం అద్దె నియంత్రణ చట్టాన్ని అమలు చేస్తామని ప్రకటించినా నేటికీ అమలు చేయలే దు. దీంతో భవనాల్లో అద్దెలకు రెక్కలొచ్చాయి. టూబెడ్ రూం ప్లాట్కు రూ.8 నుంచి రూ. 10 వేలు తీసుకుంటున్నారు. తాము లక్షలు ఖర్చు పెట్టి ప్లాట్లు కట్టింది తక్కువ అద్దెకు ఇవ్వడానికి కాదని యజమానులు చెబుతున్నారు. అద్దెల విషయంలో భవిష్యత్లో గన్నవరం రాజధానితో పోటీ ప డుతుందని అంటున్నారు. ఇదిలాగుంటే గతంలో ఎప్పుడో నిర్మించిన పాత భవనాల్లో కూడా అ ద్దెలు పెంచేశారు. రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు సాధారణ భవనంలోని ప్లాట్కి వసూలు చేస్తున్నారు. రోడ్డుకు అనుకుంటే ఉంటే రూ.పది వేలు కట్టాల్సిందే. సామాన్యులు ఇల్లు అద్దెకు తీసుకోలేని దుస్థితి వచ్చింది. అపార్టుమెంట్ నిబంధనలకు విరుధంగా కట్టేస్తున్నారు. కొత్త భవనాలు కూడా అనుమతుల్లేకుండా కడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. అద్దెలు ఇష్టానుసారంగా వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్న పరిస్థితి కొనసాగుతోంది.



అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ గ్రామానికి చెందిన రాచూరి లంకేశ్వరరావు ఒంటి నిట్టాడి ఇల్లు ప్రమాదవశాత్తు ఆదివారం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అగ్నిప్రమాదంలో సుమారు రెండు లక్షలు నష్టం ఏర్పడిందని బాధితుడు లంకేశ్వరరావు తెలిపారు. రాచూరు లంకేశ్వరావు, అద్దంకి వీరలంకమ్మ, రాచూరి శ్రీను మూడు కుటుంబాలు ఒకే ఇంటిలో నివాసముండి జీవనం సాగిస్తున్నారు. ఇల్లు దగ్ధం అవటంతో మూడు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలారు. ఆధార్ కార్డులు, బట్టలు, సామాన్లు పూర్తిగా కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం చేయాలని బావితుడు కోరుతున్నారు. సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



అధిక ధరలకు కూరగాయలు విక్రయం

ప్రజాశక్తి-కంకిపాడు

కంకిపాడు మండలంలో గల రైతు బజార్లో బోర్డు పైన ఉన్న రేటు కంటే అధిక రేట్లు అమ్ముతున్నారు. సామాన్య ప్రజలు ధరల వివరాలు అడిగితే స్టాల్ యజమానుల దగ్గర నుంచి సరైన సమాధానం రావట్లేదు. అలాగే కొంతమంది స్టాల్ యజమానులు మా స్టాలు మా ఇష్టం అన్నట్లుగా సమాధానం చెబుతున్నారు. ఆదివారం కంకిపాడు రైతు బజార్లో బోర్డులో 88 రూపాయలు ఉన్న పచ్చిమిర్చిని 100 రూపాయలకు అమ్ముతున్నారు. అదేమిటి అని అడిగితే మాకు గిట్టుబాటు అవటం లేదండి అని పచ్చిగా చెబుతున్నారు. అలాగే అన్ని రకాల కూరగాయల మీద బోర్డు మీద ఉన్న రేటు కంటే ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారు. అసలే కూరగాయలు ధరలు పెరిగిన నేపథ్యంలో దానికి తోడు మరింత అదనపు రేట్లు వసూలు చేయడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనుంచైనా అధికారులు స్పందించి అధిక ధరలను అరికట్టాలని కోరుతున్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థికి నగదు బహుమతి

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో మాజీ ఉపసభాపతి, అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి డా.మండలి బుద్ధప్రసాద్ పుట్టినరోజు వేడుకలు శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ చిన్న, జనసైనికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ లో 10వ తరగతి ఫలితాలలో సత్తా చాటిన త్రివేణికి సన్మానం చేసి చిన్న, ధానభనేని పిచేశ్వరరావు సహకారంతో రూ.5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి తుమ్మల చౌదరీ బాబు మాట్లాడుతూ ఘంటసాల మండలంలో శ్రీకాకుళం పాఠశాలలోని విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుల వారికి, ఉపాధ్యాయుల కషికి వారు అభినందనలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో శ్రీకాకుళం, శీలంవారి పాలెం, అచ్చంపాలెం, సూరపనేనివారి పాలెం, వీరమాచినేనివారి పాలెం, పాపవినాశనం, తెలుగురావు పాలెం గ్రామాల నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యాచకులకు భోజన సదుపాయం

ప్రజాశక్తి-గుడివాడ: అకేటి ఈశ్వరరావు (భీముడు) వర్ధంతి సందర్భంగా ఆయన భార్య మహాలక్ష్మి, కుమారుడు ప్రసాద్ల సహాయంతో వై నాట్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం పట్టణంలోని 50 మంది యాచకులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. సామాజిక మాధ్యమాల నందు వై నాట్ ఛారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు చూసి ప్రసాద్ నిర్ణయించుకోవడం అభినందనీయమని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఇంకా ఎవరైన సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే 91212 47676కు సంప్రదించాలని ట్రస్ట్ సభ్యులు కోరారు.



మజ్జిగ పంపిణీ అభినందనీయం : విక్కుర్తి



ప్రజాశక్తి-మోపిదేవి: వేసవిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు అన్నారు. మోపిదేవిలో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎస్.ఆర్.వై.యస్.పి జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో మోపిదేవి ప్రెస్ క్లబ్ పర్యవేక్షణలో విక్కుర్తి శ్రీనివాస్ సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవస్థానానికి వచ్చిన భక్తులకు విక్కుర్తి మజ్జిగను పంపిణీ చేశారు. మజ్జిగ పంపిణీకి ముందుకు వచ్చిన వారందరిని శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్, పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షులు తగిరిశ సాంబశివరావు, మోపిదేవి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండపల్లి శ్రీనివాసరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి బ్రాంచ్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, వైస్ చైర్మన్ రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, కోశాధికారి కందుల సీతారామయ్య, పెరవలి వీరశేఖర రావు లంకే సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడు రమేష్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాలకు చెందిన వక్కలగడ్డ రమేష్ చెన్నై భారతీయ విద్యా భవన్లో శనివారం గౌరవ డాక్టరేట్ పురస్కారం ను అందుకున్న సందర్భంగా ఘంటసాలలోని పలువురు ఆయనని అభినందించారు. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ అనుబంధ శాఖ వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. గణిత అధ్యాపకుడు రమేష్ గణితంలో హైస్కూల్ ,కళాశాల, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ చదివే పేద విద్యార్థులకు ఆర్థికంగా ఆదుకుంటూ వారి విద్యాభివద్ధికి పలు సూచనలు సలహాలు అందజేస్తూ వారికి మార్గదర్శకంగా ఉంటూ వారి విద్యాభివద్ధికి రెండు దశాబ్దాలుగా కషి చేస్తున్నందుకు గాను రమేష్ సేవలను గుర్తించి గణితంలో గౌరవ డాక్టరేట్ పురస్కారంను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ చెన్నై శాఖ వారు అందజేశారు. రమేష్ ప్రస్తుతం పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పి మేన్యూల్, గౌరవ అతిథి రిటైర్డ్ జడ్జి మురుగన్ భూపతి, రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంపత్ కుమార్, రిటైర్డ్ పోలీస్ సూపరింటెండెంట్ షణ్ముఖ సుందరం, ప్రొఫెసర్ కె. సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.



'మానవతా' సేవలు



పావనికి ప్రోత్సాహక చెక్కును అందజేస్తున్న శైలజ

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తొలుత సంస్థ గుడివాడ అధ్యక్షులు దండమూడి జయలక్ష్మీ అధ్యక్షతన నెలవారీ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 567 మార్కులు సాధించిన జమ్మా పావనికి సంస్థ తరపున రూ.5 వేలు చెక్కు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. మానవతా సభ్యురాలైన జి.శైలజ పావనికి రూ.500 నగదును అందజేశారు. అనంతరం కార్యక్రమ అతిథులు కేవీ కామర్స్ అధినేత కొమ్ము వెంకటేశ్వరరావు, కైకలూరు ఎమ్మెల్యే పి.ఏ. వంగా శ్రీనివాస్‌లతో పాటు అనేక రంగాలలో అవార్డులు పొందిన వ్యక్తులను ఘనంగా సత్కరించారు. కానూరి గీత (యూఎస్ఏ) వారి తల్లిదండ్రుల వివాహ వార్షిక మహెూత్సవం సందర్భంగా మానవతా కార్యాలయానికి వాటర్ ప్రూఫ్ టెంట్ కొనుగోలు నిమిత్తం రూ.15 వేలు వితరణగా అందజేశారు. శాంతిరథం మెయింటెనెన్స్ నిమిత్తము కొమ్ము వెంకటేశ్వర్లు, సామి రామమోహనరావులు తలా రూ.1000 చొప్పున వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ గుత్తా రమేష్, ఉమ్మడి కష్ణాజిల్లా చైర్మన్ పొట్లూరి వీర శేషగిరిరావు, చైర్మన్ మారుతి ప్రసాద్, కో-చైర్మన్ వేణుగోపాలరావు, సంస్థ ప్రెసిడెంట్ జయలక్ష్మి, ట్రెజరర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

2024-25వ సంవత్సరానికి నూతన అధ్యక్షులుగా అన్నపురెడ్డి గోపి రెడ్డి, కార్యదర్శిగా నందమూరి పద్మజ, కోశాధికారిగా గంటా చంద్రశేఖరరావులతో పాటు మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. డైరెక్టర్ బోర్డులో చైర్మన్‌గా పిన్నమనేని వేణుగోపాలరావు, కో-చైర్మన్‌గా దండమూడి జయలక్ష్మి, కన్వీనర్‌గా ఉప్పలపాటి మారుతి ప్రసాద్, ఆరుగురిని డైరెక్టర్లుగా, అడ్వైజరీ బోర్డుమెంబర్స్‌గా 9 మందిని ఎన్నుకున్నారు.



క్యూలైన్లలో యాత్రికులు

దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన యాత్రికులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనానికి ఆదివారం సెలవు దినం కావటంతో అమ్మవారి దర్శనార్థం యాత్రికులు విశేషంగా విచ్చేశారు. యాత్రికుల రద్దీ దృష్ట్యా యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను ఆలయ ఇఒ కెఎస్ రామారావు పరిశీలించారు. నిత్య ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.



ప్రజల అవసరాలే లక్ష్యంగా సేవలు

రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ డైమండ్స్ ఆవిర్భావం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సమాజంలో విద్య, వైద్యం, సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్య అవసరాలు వంటి కనీస వసతులకు నోచుకోని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్న ప్రజలకు అందించడమే లక్ష్యంగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ డైమండ్స్ కార్యవర్గం పనిచేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ జిల్లా గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు (దత్తు) అన్నారు. బందర్ రోడ్‌లోని ఒక హోటల్లో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని డైమండ్స్ క్లబ్ కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోటరీ క్లబ్ పూర్తిస్థాయి సేవా భావం కలిగిన ఒక స్వచ్ఛంద సంస్థగా ఉన్న పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింప చేసేలా కార్యవర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. డైమండ్స్ క్లబ్ చార్టర్ అధ్యక్షులుగా వై.శేషు కుమార్, కార్యదర్శిగా కె. మల్లేశ్వరరావు, సహాయ గవర్నర్‌గా గోలి రవీంద్ర, గవర్నర్ నియమిత ప్రత్యేక కార్యదర్శులు మలపాక భాస్కర్‌లను క్లబ్ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన చార్టర్ ప్రారంభం సందర్భంగా కొంతమంది పేదలకు నిత్యావసరాలు అందజేశారు.

టిడిపి నాయకుడు కారేకు నివాళి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : టిడిపి పశ్చిమ నియోజకవర్గ సీనియర్ నాయకులు "కారే వెంకట్రావు మృతి తీరని లోటని టిడిపి మాజీ ఎమ్మెల్సీ, ఉత్త రాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న తెలిపారు. ఆదివారం కారే వెంక ట్రావు దశదినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి బుద్ధా వెంకన్న పూలమల వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుర్రంకొండ, నాగోతి రామారావు, పోతినేడి లోకేష్ పాల్గొన్నారు.

దేవాలయ భూములకు బహిరంగ వేలంపాట

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలో రామలింగేశ్వర, మల్లేశ్వర స్వామి ఆలయాలకు చెందిన ఎ.12.76 సెంట్ల భూములకు జూన్ మూడో తేదీ ఉదయం 10 గంటలకు టెండర్ కం కౌలు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ బి.గంగాధర్ తెలిపారు. జూన్ 5వ తేదీ అంబారుపేట గ్రామంలోని మునేటి తీరానగల శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు స్వామివారికి చెందిన ఎ.6.97 సెంట్ల భూములకు టెండర్ కం కౌలు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఇఒ తెలిపారు. రామలింగేశ్వర స్వామి ఆలయం లో జూన్ 5వ తేదీ ఉదయం 11 గంటలకు రామలింగేశ్వర స్వామికి చెందిన ఎ25.53 సెంట్ల భూములకు టెండర్ కం కౌలు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా ఆలయాల్లో స్వామి స్వామివారికి చెందిన భూముల కౌలు బహిరంగ వేలం పాటలలో ఆసక్తి గల రైతులు పాల్గొనాలని ఆలయాల ఈవో తెలిపారు.

విచ్చలవిడిగా బెల్టుషాపులు

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో బెల్టుషాపులు ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. మద్యం షాపుల నుంచి ప్రతి గ్రామంలో ఉన్న బెల్టు షాపులకు మద్యం అక్రమ మార్గంలో తరలిపోతుంది. మండలంలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న బడ్డీ కొట్లు, షాపుల్లో మద్యం ఎంత కావాలో అంత అందుబాటులో ఉంటుంది. సాయంత్రం ఐదు గంటల ఈ బెల్టుషాపులు వద్ద రద్దీగా ఉన్న సరే సంబంధింత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అదేంటని మద్యం షాపుల వారిని అడిగితే తమకు పైనుంచి ఒత్తిడి ఉందని, సరుకు అమ్మకంలో టార్గెట్‌లు విధిస్తున్నారనే సమాధానం వస్తుంది. అక్రమంగా బెల్టుషాపుల నుంచి మందుబాబులు అధిక ధరలకైనా కొనుగోలు చేస్తున్నారు.

పట్టించుకోని ఎక్సైజ్ యంత్రాంగం

విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న బెల్టుషాపులపై ఆ శాఖ అధికారులు సైతం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మండలంలో మద్యం ఏరులై పారుతోంది. ఆ శాఖలో దిగువస్థాయి సిబ్బంది చేతివాటం జోరుగా సాగుతుందనీ, ఈ చేతి వాటంలో పై అధికారులకు కూడా వాటా ఇవ్వాలని చెప్పి ఆ దిగువస్థాయి సిబ్బంది పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

ప్రజల తరపున పోరాడేది కమ్యూనిస్టులే : బి.ఆర్.తులసీరావు

ప్రజాశక్తి - తిరువూరు : కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడితే సామాన్య ప్రజలకు ఎంతో నష్టమని, ప్రజల తరపున పోరాడేది ఒక్క కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఎం రాష్ట్ర నాయకులు బి.అర్.తులసీరావు అన్నారు. సిపిఎం సీనియర్ కార్యకర్త షేక్ పెంటు సంతాప సభ తిరువూరులో పోస్టాఫీసు ఏరియాలో ఆదివారం సాయంత్రం పంతంగి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా పెంటు చిత్రపటానికి పులమలేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధ్భంగా తులసీ రావు మాట్లాతూ పెంటు, అయన సోదరుడు మస్తాన్ పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. తిరువూరులో పేదల సమస్యలపై సిపిఎం చేసిన ఆందోళనలో ఇరువురు అన్నదమ్ములు విస్తృతంగా పాల్గొనేవారన్నారు. సిపిఎం ఇంకెక్కడ ఉందని చెప్పే వారికి తులసీరావు గట్టి బుద్ధి చెప్పారన్నారు. ఎన్నికల్లో కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు రాకపోయినా ప్రజల పక్షాన నిలబడేది తామేనని చెప్పారు. ఎన్నికల్లో డబ్బులు, మద్యం వెదజుల్లి గెలిచిన వారు, అధికారంలోకి వచ్చిన పార్టీలు ప్రజా సమస్యల్ని విస్మరించి, పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు ప్రజా సంపదను కట్ట బెడుతున్నాయని తులసీరావు పేర్కొన్నారు. సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గుళ్ల పల్లి వెంకట రత్నం మాట్లాడారు. మసీదు కమిటే మాజీ అధ్యక్షులు, కౌన్సిలర్‌గా చేశారన్నారు. ప్రజానాట్యమండలి కళా కారులు అమరవీల గేయాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పెంటు తనయుడు కరిముల్లా, సోదరుడు మస్తాన్ సిపిఎం నాయకులు కార్యకర్తలు బంధువులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తులసీరావు



మాట్లాడుతున్న వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు ఇజ్రాయిల్

నిందలు వేయడం శోచనీయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు వస్తే తనపై వైసిపి నేతలు దాడి చేస్తారని ఇండిపెండెంట్ అభ్యర్థి వేల్పుల విజయ్ కుమార్ నిందలు వేయడం శోచనీయమని వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు అన్నారు. పట్టణంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆదివారం చిల్లకల్లు వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు కటికోల ఇజ్రాయిల్, గొర్రెపాటి సుదర్శన్ విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు వైసిపిలో ఉండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసి వైసిపి నేతలపై నిందలు వేయడం హాస్యాస్పదమన్నారు. ఇదే వేల్పుల విజయ్ కుమార్ కు గతంలో ఉదయభాను ఆర్థికంగా ఉపాధి కల్పించడంతో పాటు, రాజకీయంగా కూడా గుర్తింపుని ఇచ్చారని తెలిపారు. ఉదయభాను కుమారుడు, అల్లుడు తనను బెదిరించారని అనడంలో వాస్తవం లేదన్నారు. ఎన్నికల కమిషన్ తన పని తాను చేసుకుంటూ పోతుందని చెప్పారు. జూన్ 4వ తేదీన వెలువడే ఫలితాల్లో సామినేని ఉదయభాను అఖండ మెజారిటీతో విజయం సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కారుపాటి జీవరత్నం, కన్నమల శ్యాముల్, దారెల్లి బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో హోమం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి సంకట హర చతుర్థి సందర్భంగా ఆదివారం ఉదయం కొండపైన చిన్నరాజగోపురం వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి మందిరం దగ్గర ఏర్పాటు చేసిన యాగశాల వద్ద వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ ఈవో కె.ఎస్.రామారావు సమక్షంలో వైదిక సిబ్బందిచే శాస్త్రోక్తంగా గణపతి స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైదిక సిబ్బంది, ఆలయ అర్చకులు, ఇతర సిబ్బంది, యాత్రికులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలతో బెంబేలు

ప్రజాశక్తి - వీరులపాడు : కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఒకవైపు నిత్యావసర ధరల భారంతో అల్లాడుతుంటే మూలిగేనక్కపై తాటికాయ పడినట్లు ఈ కూరగాయలు ధరలు భారంగా మారాయి. బహిరంగ మార్కెట్లో ధరల పరిస్థితి గురించి వేరే చెప్పక్కర్లేదు మిర్చి కిలో ధర రూ.100లు పైగానే బహిరంగ మార్కెట్లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. రైతు బజారులో వంకాయ బెండకాయ బీరకాయ రూ.70లకు పైగానే ధర పలుకుతుంది ఉల్లిపాయ రూ.30 లకు పైగానే ఉంది. కొత్తిమీర కట్ట రూ.40 రూపాయలు పైగానే ధర ఉన్నది. ఒక వారానికి కావాల్సిన కూరగాయలు కుటుంబానికి 800 రూపాయలు పైగానే ఖర్చు అవుతున్నాయి. ఇంత ఖర్చుపెట్టినా వారానికి సరిపడా కూరగాయలు రావటం లేదని ప్రజలు వాపోతున్నారు. సామాన్య ప్రజలు కడుపునిండా భోజనం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం తెచ్చుకునే మాంసాహారంతో కలుపుకుంటే రూ.వెయ్యికి పైగానే ఖర్చవుతుంది. కూరగాయల ధరలతో పాటు పాలు గ్యాస్ కేబుల్ బిల్లు ఫోన్ బిల్లులు పెట్రోల్ బిల్లులు వీరిపై భారంగా మారింది. కందిపప్పు మినపప్పు పెసరపప్పు కిలో ధర రూ.140 లు విక్రయిస్తున్నారు.





బడిబాట కార్యక్రమంలో ప్రదీప్

చింతలపాడులో బడిబాట

ప్రజాశక్తి - తిరువూరు : వివిధ పాఠశాలల్లో పిల్లలు నమోదు నూటికి నూరు శాతం ఉండాలనే లక్ష్యంతో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం.రాం ప్రదీప్ తెలిపారు. తిరువూరు మండలంలోని ఆదివారం చింతల పాడులో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల నమోదు నూరు శాతం ఉన్నప్పటికీ, ఉన్నత విద్యలో ఆ స్థాయి నమోదు కన్పించడం లేదని తెలిపారు. గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం లక్ష్మీపురం శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. రూ.30,500 నగదుతో సహా 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పేకాట రాయుళుతెలంగాణ ప్రాంతానికి చెందిన వారని తెలిపారు.



కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం జొన్నలగడ్డ జిల్లా పరిషత్ పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో 34 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై కలిశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలోనే సరదాగా గడిపారు. పూర్వ రోజులను గుర్తు చేసుకోవడంతో పాటు ప్రస్తుత స్థితిగతులపై ఆప్యాయతగా మాట్లాడుకున్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు అనిల్, జానీ, నాగయ్య, సురేష్, చెన్నకేశవులు, శ్రీనివాస్, వెంకటరామయ్య, రామారావు, శ్రీనివాసరావు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

బోనాలు సమర్పణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి తిరణాల మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఈవో ఫణికుమార్ పర్యవేక్షణలో ఆలయ అదికారులు శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవార్లకు కుంకుమార్చన విశేష పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పాల పొంగళ్ళు శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవార్లకు సమర్పించి గ్రామ బోనాలలో మొక్కులు తీర్చుకున్నారు.

ముంపు బారిన పొలాలు... రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-బంటుమిల్లి: బంటుమిల్లి మండలంలోని మలపరాజు గూడెంలో కొత్తపల్లి మైనర్ మురుగు కాలువ తుమ్మిడి మురుగు కాలువల్లో కలవటానికి సుమారు మూడు కిలోమీటర్లు ఉంటుంది. దీని పరిధిలో దాదాపు 300 ఎకరాలు పంట పొలాలు ప్రతి సంవత్సరం ముంపునకు గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో సుమారు 8 సంవత్సరాల క్రితం డ్రెయిన్‌ను తవ్వారు. ఈ మధ్యకాలంలో అక్కడక్కడ గుర్రపు డెక్క, తూటుకాడను తొలగించడం జరిగింది. అయినా ప్రతి సంవత్సరం భారీ వర్షాలు వచ్చినప్పుడు పంట పొలాలు ఈ ప్రాంతమంతా మోకాలు లోతు నీళ్లలో కొన్ని రోజుల పాటు నిలబడి ఉండటం జరుగుతుంది. గత సంవత్సరం సార్వపంట వేసినప్పుడు కూడా విత్తనాలు మొలకెత్తిన


డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

సందర్భంలో భారీ వర్షాలు పడటం వలన అవి కుళ్లి దెబ్బతింది. మరలా రైతులు నాట్లు వేశారు. మిచౌంగ్ తుపాన్ ప్రభావం వల్ల భారీ వర్షాలకు పంట పొలాలు దాదాపు వారం, పది రోజులు పాటు నీళ్ల మునిగి ఉండటం వల్ల పంట కూడా దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు కొత్తపల్లి మైనర్ మురుగు కాలువను తవ్వించి రైతుల పంటపొలాలను కాపాడాలని కోరుతున్నారు.

పంటలను కాపాడాలి

ఎపి రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు

రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీనీ వెంటనే తవ్వి పంటలను కాపాడాలి. కృష్ణాజిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో ఈ డ్రైనేజీ సమస్య ఉంది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బందులు కలగకుండా, పంట నష్టపోకుండా చూడాలి.

బుద్ధప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి: మాజీ ఉపసభాపతి, అవనిగడ్డ నియోజకవర్గ కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం స్థానిక పడమర వీధిలోని జనసేన కార్యాలయం వద్ద జన సైనికులు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు కేక్ ను ఆకుల స్వభూప్రసాద్, జనసేన నాయకులు పసుపులేటి రవికుమార్, తోట కనకదుర్గ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రావి రాజేశ్వరరావు, బళ్లా వాసు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు ఉస్మాన్ షరీఫ్, గాజుల తాతారావు బొందలపాటి వీరబాబు, సూదాని నంద గోపాల్, తోట మురళీకృష్ణ, సోమిశెట్టి రాఘవేంద్రరావు, రావులపల్లి పండు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయాలతో విజ్ఞానం : వాణి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి కథలు పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారిని టి.వాణి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద ఆదివారం వేసవిజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులతో నీతి కథలు చదివించడం, ఆ కథలోని నీతిని వివరించారు.



జిల్లాస్థాయి జూనియర్ రగ్బీ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం: ఉమ్మడి కృష్ణాజిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో జూనియర్ బాల బాలికల రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించినట్టు అసోసియేషన్ కార్యదర్శి నాగళ్ళ చంద్ర కళ తెలిపారు.ఈ ఎంపికల్లో సుమారు 48 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, జి.రాంబాబు, కె. బాల కష్ణ,నరసింహ రాజు, గౌసియ లు ఎంపికలు నిర్వహించారని తెలిపారు.జిల్లా జట్ల ఎంపికల కార్యక్రమం లో గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య,గన్నవరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె వి ఆర్ కిషోర్,ఉపాధ్యక్షుడు నిడ మర్తి నాగేశ్వరరావు,న్యాయవాది తిరివీది వెంకయ్య,విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు బి.సత్యనారాయణ,గన్నవరం వాలీబాల్ క్లబ్ కోశాధికారి రవి ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు నిమ్మగడ్డ రవీంద్ర భవానీ పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.సర్పంచ్ సౌజన్య మాట్లాడుతూ ఇష్టం తో క్రీడల్లో పాల్గొనాలని ,చదువు క్రీడలు సమానం గా తీసుకొని రాణించాలని హితవు పలికారు.దేశ పటిష్టల్లో క్రీడలు ప్రధాన



భాగమని పతకాలు సాధించి దేశ ప్రతిష్టలను ఇనుమడింప చేయాలని కోరారు.

అనంతరం రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి చంద్ర కళ జిల్లా జట్టులను ప్రకటించారు .బాలుర జట్టుకు జి.బిళ్ళ హరి సాయి బాబు (కెప్టెన్), ఆర్.సాయిరాం, జి.ప్రేమ్, కె.లుర్దు, ఏం.డేవిడ్, సాజల్, ఎ.రామ్ చరణ్, ఎం డీ ఉమర్, టి.రాజ మౌళి, బి.పాండు, వి.చరణ్, కె.ఆర్తి రాముడు ఎంపికయ్యారు. బాలికల జట్టుకు జి.గంగా భవాని (కెప్టెన్), వి.గీతశ్రీ, బి.నిహారిక, సి.హెచ్ జాహ్నవి, ఎ.గౌతమి, ఎన్.అపరంజి, ఎల్. ఝాన్సీ, ఎస్ కె. ఆషా, ఎస్ కె జైనాబీ, వై.నందిని, పి.శైలజ, కె.శరణ్య లు ఎంపికైనట్లు చంద్ర కళ తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 31, జూన్ 1 వ తేదీన విశాఖ పట్టణం తిమ్మాపురంలో జరిగే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కల్లుగీత వృత్తిని కాపాడండి

ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు



ప్రజాశక్తి-చల్లపల్లి: రాష్ట్రంలో కల్లు గీత వత్తి కనుమరుగైపోతుందని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాలు చేసి సాధించుకున్న ఫలితాలను కూడా కార్మికుల పొందలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి 16 నెలల క్రితం విజయవాడలో విడుదల చేసిన జీవో నెంబర్ 21 ప్రకారం గీత కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. 1978లో పది వేలు 2004లో రెండు లక్షలు 2014లో ఐదు లక్షలు, 2023లో పది లక్షలు నష్ట పరిహారం అందించేలా పోరాటం చేసి సాధించుకున్నామని చెప్పారు. జీవో నెంబర్ 21 ప్రకారం విధి నిర్వహణలో చనిపోయిన కల్లుగీత కార్మికులకు ఎక్స్గ్రేషియా 10 లక్షలు ప్రకటించినప్పటికీ విధి విధానాలు రూపొందించకపోవడంతో ఒక కార్మికునికి కూడా న్యాయం జరగలేదని అన్నారు. గతంలో మాదిరిగా మరణించిన వారు, శాశ్వత వికలాంగులు, తాత్కాలిక వికలాంగులను మూడు కేటగిరీలుగా గుర్తించి ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ద్వారా నష్టపరిహారం కేసులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గౌడ, శెట్టిబలిజ, ఈడిగా, శ్రీశయన, యాత కులానికి చెందినవారు, కొన్ని ప్రాంతాలలో గిరిజనులు, దళితులు కల్లుగీత వృత్తిపై ఆధారపడి



ఉన్నారన్నారు. 1991లో పోరాడి సాధించుకున్న ఆర్థిక కార్పొరేషన్ను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసి, కులాల వారీగా 56 కార్పొరేషన్లు పెట్టి గీత కార్మికులకు అన్యాయం చేసింది అన్నారు. ఆర్థిక కార్పొరేషన్ పునరుద్ధరించి, బడ్జెట్లో నిధులు కేటాయించి గీత కార్మికులను ఆదుకోవాలి. పంట కాలువలు, మురుగు కాలువలు ఆధునీకరణ పేరుతో తాటి చెట్లు, ఈత చెట్లు కూల్చి వేస్తున్నారు. రాష్టంలో రియల్ ఎస్టేట్ విస్తరించటంతో చెట్లను ముందుగానే తొలగిస్తున్నారు. దీంతో గీత కార్మికులు ఉపాధి కోల్పోయి దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వ స్థలాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా తాటి, ఈత,హైబ్రిడ్ విత్తనాలు నాటు తామని జగన్మోహన్ రెడ్డిప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఇప్పటికైనా పంట కాలువలు, మురుగు కాలువ గట్లు, చెరువుగట్లపై తాటి, ఈత, హైబ్రిడ్ విత్తనాలు నాటి గీత కార్మికులకు, గొర్రెలు, మేకలు పెంపకం దారులకు, పర్యావరణ సమతుల్యానికి మేలు జరిగేటట్లు రాబోయే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నుండి గీత వత్తికి తగిన రక్షణ లేకపోవడం వల్ల గీత వత్తి కనుమరుగై పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.కల్లులో మనుషుల ఆరోగ్యానికి ఉపయోగపడే పోషకాలు, ఔషధ గుణాలు, విటమిన్‌లు మెండుగా ఉన్నాయని పరిశోధనలో తేలిందన్నారు. కల్లు ఉపయోగాలను ప్రభుత్వం ప్రచారం చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. నీరా కల్లు ఏర్పాటుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, తాటి చెట్లు ధ్వంసం కాకుండా గతంలో లాగా చెట్లకు నంబర్ రింగ్ వేసి, రక్షణ కల్పించాలని, చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని, జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ జారీ చేసిన గుర్తింపు కార్డులు జిల్లా అంతటా ఉపయోగపడాలని, ప్రతి సంవత్సరం టిటిసిఎస్ అధ్యక్షులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని, కేరళ, తెలంగాణ రాష్ట్రాలలో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి సంఘాలను పటిష్ట పరచాలని, వృత్తి రక్షణ, ఉపాధి గ్యారెంటీ ఇవ్వాలని రామచంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

పెనమలూరు: పోరంకిలోని సిఐటియు కార్యాలయంలో క్లాప్ ఆటోడ్రైవర్లు, మున్సిపల్ కార్మికుల సమావేశ ం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జ్యోతి బోసు, కృష్ణాజిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వైయస్సార్ తాడిగడప మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వై సరళ, పెనమలూరు సిఐటియు అధ్యక్షులు ఎస్కే మస్తాన్ వలి, కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి నర్సయ్య పాల్గొన్నారు.

వేమవరానికి యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుండి సుమారు 22 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని పాల పొంగళ్లు సమర్పించి వారి మొక్కుబడులను తీర్చుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. 27వ తేదీ సోమవారం అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను అనివేటి మండపంలో లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి: రావి యూత్ ఆధ్వర్యంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్థానిక నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమంలో అనాధ వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రావి చిట్టిబాబు, యార్లగడ్డ శివయ్య, అనుముకొండ రమణ, లంక ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



హజ్ యాత్రికులకు సత్కారం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించాలని కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర కోరారు. మచిలీపట్నం నియోజకవర్గం నూరి నగర్ నుంచి హజ్ యాత్రకు బయలుదేరిన ముస్లిం సోదరులకు రవీంద్ర ఆదివారం శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ మచిలీపట్నం నుండి హజ్ యాత్రకు వెళుతున్న ముస్లిం సోదరులు వారి యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని రావాలని ఆకాంక్షించారు. అలాగే రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించాలని కొల్లు రవీంద్ర కోరారు. హజ్ యాత్రకు వెళుతున్న వారిలో షేక్ జిలాని, షేక్ సుభాని, అల్లా భక్షు, ఉన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ హుస్సేన్, ఇబ్రహీం, అబ్దుల్ అజీమ్, ఫిరోజ్, ఖలిశా, అన్వర్ హుస్సేన్, గాలిబ్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.





ఆర్లపాడులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గంపలగూడెం : ఉన్నతాధికారుల ఆదేశాలే శిరోధార్యం అని తిరువూరు సిఐ షేక్ అబ్దుల్ నభి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకే మండలంలో ఆర్లపాడు గ్రామాన్ని కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జరగనున్న సాధారణ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గ్రామంలో అసాంఘిక శక్తులను గుర్తించి, అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. సమస్యలు తలెత్తకుండా తాము ఉన్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. మొత్తం 50 మంది పోలీసులు గ్రామాన్ని చుట్టముట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా 20 ద్విచక్ర వాహనాలను వివిధ పత్రాలు లేనివిగా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ కొండూరు ఎస్సై చల్లా కృష్ణ, గంపలగూడెం ఎస్ఐ ఎస్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డిసిపి శ్రీనివాసరావు

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఎన్టీఆర్ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.హెచ్.డి రామకృష్ణ ఆదేశాల మేరకు నందిగామ సబ్ డివిజన్ వ్యాప్తంగా డిసిపి కె.శ్రీనివాసరావు, ఎసిపి డాక్టర్ రవికిరణ్ ఉత్తర్వుల మేరకు శనివారం రాత్రి జగ్గయ్యపేట ఇన్‌ఛార్జి ఎస్.పరమేశ్వర్ సమక్షంలో జగ్గయ్యపేట సర్కిల్ ఎస్ఐలు వారి సిబ్బంది సహాయంతో ధనంబోర్డ్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అందులో భాగంగా 305 ఇళ్లను సోదా చేశారు. ఆ సోదాలో భాగంగా 120 బైక్స్, 3 ఆటోలు, తనిఖీ చేయగా 8 బైక్స్, 1 ఆటోను ఎటువంటి పత్రాలు లేని కారణంగా స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 18 నుండి 25 వరకు దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు ఆధ్వర్యంలో శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారి ట్రస్టు, కె.సి.పి సహాయ సహకారంతో జరిగిన బ్రహ్మోత్సవాల్లో ఆఖరి రోజు శనివారం రాత్రి ముగిసాయి. శ్రీ స్వామి కళ్యాణోత్సవాల సందర్భంగా ఇందిరాదత్తు సుమారు 3 కేజీల బంగారంతో శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారికి కిరీటం, కర్ణాలు, హస్తాలు, శ్రీ చెంచు లక్ష్మీ అమ్మవారికి కిరీట, హస్తాలు, సుమారు 2.50 కేజీల వెండితో నరసింహ స్వామి విగ్రహం తయారు చేయించారు. గుంటూరు జిల్లాలోని ఉల్లిందన గ్రామస్తులకి, కళ్యాణం రోజు రాత్రి అన్నదానం నిర్వహించిన దాతలు కందులవారిపాలెం, హైదరాబాదు, కట్టమూరు గ్రామస్తులకు, హేమాద్రి సిమెంట్స్ ఫ్యాక్టరీ, రాంకో సిమెంట్ ఫ్యాక్టరి వారికి దన్యవాదములు తెలిపారు.



బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమం



గంపలగూడెం

ఆంగ్ల భాషతోనే ప్రపంచాన్ని చుట్టెయ్యొచ్చు

ప్రజాశక్తి - గంపలగూడెం :
ఆంగ్ల భాష (ఇంగ్లీష్) అనార్గళంగా అలవర్చుకుంటే ప్రపంచాన్ని చుట్టేయచ్చని ప్రముఖ ఆంగ్ల భాష ఉపాధ్యాయులు మందడపు రాంప్రదీప్ తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఇన్‌ఛార్జ్ సుంకర నాగేశ్వరరావు విద్యార్థులను సమీకరించి, ఆంగ్లభాషపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన రామ్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆంగ్లభాషపై ఆసక్తి చూపాలని కోరారు. పెనుగలంలో ఉన్న గ్రంథాలయ శాఖలో విద్యార్థులకు పలు అంశాలపై ఇన్‌ఛార్జ్ శ్రీలత అవగాహన కల్పించారు.

చదరంగం పోటీలు

ప్రజాశక్తి - మైలవరం :
స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.నాగరాజు, విద్యార్థులచే పంచతంత్ర కథలు పుస్తకాలు చదివించి చెప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట

బొకే తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులచే పుస్తక పఠనం, వార్తా పత్రికలు చదివించారు. తదుపరి బి.డి.సి మల్లిక విద్యార్థులకు కలర్ పేపర్స్‌తో బొకేలు తయారు చేయడం నేర్పించి వారితో చేయించారు. అనంతరం లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు, గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది శ్యామల, సత్యవతి పాల్గొన్నారు.

పుస్తక పఠనం, ఆటల పోటీలు

ప్రజాశక్తి - కంచికచర్ల
: కంచికచర్ల,శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అందులో భాగంగా డాన్స్ మాస్టర్ వేల్పుల ఆకాష్ విద్యార్థులకు డాన్స్‌లో మెళుకువలు నేర్పించారు. డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వరరావు విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పించారు. యోగా మాస్టర్ ఎమ్.మల్లికార్జునరావు యోగాసనాలు విద్యార్థులకు నేర్పించారు. యోగా వల్ల ఆరోగ్యంతో పాటు శరీరం దృఢంగా ఉంటుందన్నారు. క్రాఫ్ట్ మాస్టర్ కనకారావు విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్ నేర్పించారు. అనంతరం విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించారు. ఆటలు పాటలతో వేసవి శిబిరం ఆదివారం సందడిగా సాగినట్లు గ్రేడ్ 2 గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు తెలిపారు.



కంచికచర్ల



మైలవరంలో

ఆరోపణలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ ఎం.ఈ.ఓ 1 పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో చర్యలు వేగవంతం చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు విలేకరులతో మాట్లాడుతూ నందిగామ ఎంఇఒ పుష్పలతపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయన్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నం విద్యా శాఖ కార్యాలయంలో ఎంఇఒ పుష్పలతపై వచ్చిన అవినీతి ఆరోపణలపై అధికారులు విచారణ చేసినా ఇంతవరకు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. నందిగామ, చందర్లపాడు, పెనుగంచిప్రోలు తదితర మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఇఒగా పని చేస్తున్న పుష్పలతపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయన్నారు. ఆదాయ పన్ను పత్రాలు సమర్పించే సమయంలో ఉపాధ్యాయుల వద్ద ఎంఇఓ నగదు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయని అన్నారు. ఈ ఆరోపణలపై విచారణ చేసిన సంబంధిత అధికారులు వెంటనే నివేదిక బయట పెట్టాలని, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఎంఇఒ పుష్పలతను విధుల నుండి తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

క్రికెట్, ఎన్నికల బెట్టింగులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో ఎన్నికల కౌంటింగ్ తేదీ దగ్గర పడే కొద్దీ విజేతలు ఎవరనే దానిపై పెద్ద ఎత్తున బెట్టింగులు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు, ఎమ్మెల్యే అభ్యర్థి పైన లక్షల్లో పెద్ద ఎత్తున బెట్టింగులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఐపిఎల్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌కి కూడా పెద్ద ఎత్తున బెట్టింగులు కొనసాగుతున్నాయి. ఈ బెట్టింగులు మొత్తం పబ్లిక్ ప్రదేశాల్లోనే కొనసాగడం చాలా విడ్డూరంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పేకాట రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - గంపలగూడెం: ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి నిర్వహించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మండలంలో కనుమూరు శివారు మామిడి తోటలో వచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. పేకాటముక్కలతో పాటు ఆరు ద్విచక్ర వాహనాలు, ఆరుగురు వ్యక్తులను, నాలుగు వేల రూపాయల నగదును అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేయనున్నట్లు వివరించారు.



విరాళం అందజేస్తున్న దాత కుటుంబం

నిత్యాన్నదానానికి విరాళం


ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రతి రోజు జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి మధిర మండలం దేశినేనిపాలెం గ్రామానికి చెందిన శాఖముడి పానకాలరావు, ధనలక్ష్మి దంపతులు రూ.10,116/- విరాళంగా ఆదివారం అందజేశారు. దాతలకు శ్రీ స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం ఆలయ సిబ్బంది అందజేశారు.

ఆ పార్టీలకు టెన్షన్


ప్రజాశక్తి - నందిగామ :
నందిగామ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల్లో పైకి కనిపించని టెన్షన్ మొదలైంది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నందిగామ అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ నెల 13న ఎన్నికలు జరిగాయి. ఓటింగ్ ఎలాంటి అల్లర్లు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. దాదాపుగా 86 శాతం పైగా పోలింగ్ జరిగింది. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ విడుదల నాటి నుండి ప్రధాన పార్టీలు విజయం మాదే అంటే కాదు మాదే అని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అదే స్థాయిలో నామినేషన్లు దాఖలు సమయంలో భారీ ఖర్చుతో కూడిన ర్యాలీలు నిర్వహించారు. తిరిగి అదే స్థాయిలో పోలింగ్ ముందు రోజు ఓటర్లకు భారీగానే మద్యం బాటిల్స్, నగదు పంపిణీ చేశారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్దకు భారీగా తరలివచ్చారు. వీరు ఏ పార్టీకి ఓటు వేశారో అని ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు టెన్షన్ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల నాయకులు ఎవరూ మీడియా ముందు గానీ పార్టీ కార్యకర్తలకు గానీ ధైర్యంగా విజయం మనదే అని చెప్పలేకపోతున్నారు. నియోజకవర్గంలో ఉన్న 222 పోలింగ్ బూత్‌ల వారీగా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పోలయ్యాయో ప్రధాన పార్టీల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. అయినా విజయం తమదేనని చెప్పలేకపోతున్నారు. వైసిపి ఓటర్లకు పంపిణీ చేసేందుకు వార్డు, గ్రామ స్థాయిలో ఇచ్చిన నగదు పంపిణీ విషయంలో అవకతవకలు జరిగాయనే ఆందోళన అధికార పార్టీ నాయకుల్లో టెన్షన్ పుట్టిస్తుంది. ఏది ఏమైనప్పటికీ కౌంటింగ్ మరో తొమ్మిది రోజులు ఉంది. అప్పటి వరకు ప్రధాన పార్టీల నాయకులకు, నందిగామ నియోజకవర్గ ప్రజలకు తప్పదు మరి.

వరుసగా రెండు సార్లు విజయం సాధించిన నాయకులు

నందిగామ నియోజకవర్గంలో రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రారంభం నాటి నుంచి నేటి సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు విజయం సాధించిన వారు ఇద్దరేసి ఉన్నారు. మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, మాజీమంత్రి ముక్కపాటి వెంకటేశ్వరరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎ తంగిరాల ప్రభాకరరావు వరుసగా నియోజకవర్గంలో రెండు సార్లు విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో పోటీ చేసిన ఎంఎల్ఎ డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు విజయం సాధించి వరుసగా రెండో సారి విజయం కోసం 2024లో సైతం పోటీలో ఉన్నారు. 2014 ఎన్నికల్లో అప్పటి రెండోసారి విజయం సాధించిన తంగిరాల ప్రభాకరరావు ప్రమాణస్వీకారం చేయకుండానే మృతి చెందారు. ఆ వెంటనే జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన కుమార్తె తంగిరాల సౌమ్య పోటీ చేసి గెలుపొందారు. 2019 లో ఓటమి చవిచూశారు. రెండోసారి విజయం కోసం 2024లో సైతం పోటీలో ఉన్నారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో ఎవరు గెలిచినా రెండోసారి విజయం సాధించిన వారి జాబితాలో చేరతారు.



తెలుగు ప్రజల అభిమానధనుడు మండలి : గజల్



పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ: తెలుగు ప్రజల అభిమాన ధనుడు మండలి బుద్ధప్రసాద్ అని గజల్ శ్రీనివాస్ ప్రశంసించారు. ఆదివారం అవనిగడ్డలో టిడిపి బిజెపి జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ 68వ జన్మదిన వేడుకలు కృష్ణాజిల్లా రచయితల సంఘం, దివిసీమ సాహితీ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ సాహితీవేత్త శ్రీ రమణ రచన విశ్వనాథ సాహిత్య అకాడమీ ప్రచురణ వ్యాసరమనీయం కృతి సమర్పణ కార్యక్రమం నిర్వహించి కృతిని బుద్ధ ప్రసాద్‌కు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ సినీ రచయిత బుర్ర సాయి మాధవ్ జన చైతన్య వేదిక వి లక్ష్మణారెడ్డి పాల్గొని బుద్ధ ప్రసాద్ తెలుగు భాష ఉద్యమానికి చేసిన కృషిని అభివర్ణించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సుప్రసిద్ధ సాహితీవేత్త శ్రీ రమణ రచించిన వ్యాసరమనీయం కృతిని తనకు అంకితం ఇవ్వడం తన అబుష్టంగా భావిస్తున్నానని అన్నారు. రాజకీయాల్లో ఉండాలా వద్దా అనే విషమ పరిస్థితి ఎదురైనప్పుడు రాజకీయ బలంతో తెలుగు భాషాభివృద్ధికి సంస్కృతి సాహిత్య పరిరక్షణకు సాంస్కృతిక రంగాన్ని ప్రోత్సహించే అవకాశం లభించిన సందర్భాలు గుర్తుకు వచ్చి విరమించుకున్నట్లు తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి రాజకీయ పదవుల ద్వారానే కషి చేసే అవకాశం దక్కిందన్నారు రాజకీయాల్లో ఉండటంతోనే తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో కషి చేయగలిగినట్లు బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఈ ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గం ప్రజలు తనకు అండగా నిలిచారని గెలుపు తథ్యమని అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. తప్పనిసరిగా రాబోయే రోజుల్లో తెలుగు భాషా పరిరక్షణకు భాషా వ్యాప్తికి సాంస్కృతిక దీప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బద్ధ ప్రసాద్ ప్రకటించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ జన్మదిన వేడుకలు ఉదయం నుండి ఆయన స్వగహం వద్ద ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా టిడిపి జనసేన శ్రేణులు అభిమానులు నియోజకవర్గ స్థాయిలో తరలివచ్చి బుద్ధ ప్రసాద్ చేత కేకులు కట్ చేయించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన వ్యాసరమనీయం కృతి మహోత్సవ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ ఏజీఎం కొప్పర్తి రాంబాబు, గౌరవ అతిథి వివా విట్టు అధ్యక్షులు వాసిరెడ్డి విద్యాసాగర్, విశ్వనాథ సాహిత్య అకాడమీ కార్యదర్శి మోదుగుల రవికృష్ణ, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి వి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-పమిడిముక్కల: విద్యాబుద్ధులు నేర్పిన గురువులు పుస్తక ప్రపంచాన్ని తమకు అందించిన గురువులు గొప్పవారని 2007 ఎనిమిది పూర్వ విద్యార్థుల సంఘం వారు తెలిపారు. ఆదివారం పమిడిముక్కల మండలంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో 2007-08 పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. గతంలో చదువుకున్న పాటల గురించి పాఠశాలలో చేసిన కార్యక్రమాల గురించి ఆటల్లో ప్రతిభ గురించి నైపుణ్యం కలిగిన విద్యా విధానం గురించి చర్చించుకోవడం జరిగింది. జీవితంలో స్థిరపడడానికి విద్య ముఖ్య కారణం అని ఉపాధ్యాయులు వివరించారు. మండలంలోని అగినపర్రు, పమిడిముక్కల, అమ్మినాపురం, వీరంకి నుండి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఆనాటి ఉపాధ్యాయులు స్వర్ణలత, వేణుగోపాలరావు, బి.సురేష్, కొండలరావులను సన్మానించారు.


తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య

ప్రజాశక్తి-కంకిపాడు: పెనమలూరు మండలంలోని గంగూరు గ్రామానికి చెందిన కసింకోట భార్గవ్ (24) డ్రైవర్‌గా పని చేస్తూ ఉంటాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం తరచూ పని మానేసి ఖాళీగా ఉంటున్నాడనే ఉద్దేశంతో తల్లి పనికి వెళ్లాలని చెప్పి మందలించగా మనస్థాపం చెందిన యువకుడు పెదపులిపాక కరకట్ట సమీపంలో చెట్టు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్గవ్‌కు వివాహమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉయ్యూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కవ్వింపు చర్యలొద్దు : తోట

ప్రజాశక్తి-గన్నవరం: వైసిపి కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో గన్నవరం నియోజకవర్గం నుండి ప్రజలు 84.88 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారని వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జూన్ 1 తేదీన ఎగ్జిట్ పోల్స్ రానున్నాయని ఎగ్జిట్ పోల్స్ కొన్ని వైసిపికి కనుకూలంగా కొన్ని టిడిపికి అనుకూలంగా వస్తాయని చెప్పడం జరుగుతుందని, ఈ ఎగ్జిట్ పోల్స్‌పై వైసిని శ్రేణులు టువంటి సంబరాలు గాని, అవాంఛనీయ సంఘటన గాని చేయవద్దన్నారు. ప్రతిపక్షాలను రెచ్చగొట్టే కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని కోరారు. చట్టాలను గౌరవించాలన్నారు.

ప్రముఖ కళాకారుడు గంగాధర్‌రావు మృతి



ప్రజాశక్తి-ఘంటసాల: ప్రముఖ జానపద కళాకారుడు కళా బంధువు తూములూరి గంగాధరరావు ఘంటసాల గ్రామంలో ఆదివారం మృతిచెందారు. ఈయన జానపద కళారంగానికి విశిష్టత సేవలు అందించారు. శ్రీ వెంకటేశ్వర బాలభక్త భజన సమాజం మురళి కోలాటం గురువుగా, తెలుగు చలనచిత్రం దేవుడు చేసిన మనుషులు, హిందీ చలనచిత్రం టక్కర్ చిత్రంలో తన కోలాట ప్రదర్శనను ప్రదర్శించారు. తన కళా నైపుణ్యంతో ఆధ్యాత్మిక భక్తి పాటలతో పాటు జానపద గేయాలు కూడా మేళవించి తన కోలాట బందంచే రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. బుర్రకథ పితామహుడు నాజర్ చే ప్రసంశలు అందుకున్నారు. ఘంటసాల గ్రామంలో శ్రీ రామాలయం నిర్మించడంలో ఆయన కషి చేశారు. ముఖ్యంగా టీవీ ఆర్టిస్టు రేడియో ఆర్టిస్టు అని కూడా పేరొందారు. ఈయన మతికి గ్రామంలోని రజక రామాలయ కమిటీ ప్రెసిడెంట్ ఆదిరాల దుర్గ భవాని, ఆదిరాల రాముడు, పోతార్లంక వీర వెంకటరావు, పోతాలంక వెంకటేశ్వరరావు, గురునాథ ప్రసాద్, తూములూరు శ్రీనివాసరావులు ఆయన భౌతిక కాయానికి సందర్శించి నివాళులర్పించారు. ఘంటసాల మార్కెట్ యార్డ్ చైర్మన్ వేమూరి వెంకట్రావు, సచివాలయ కన్వీనర్ వేమూరి ప్రవీణ్ బాబు, గోపాలకష్ణ, జనార్ధన్‌లు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



ప్రజాశక్తి-ఘంటసాల: విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకంలో భాగంగా 6వ రోజు ఆదివారం వ్యవసాయ విద్యపై గ్రామంలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ విద్య ద్వారా మంచి భవిష్యత్ ఉటుందని తెలిపారు. రాష్ట్రంలో చాలా మంది విద్యార్థులు ఆగ్రికల్చర్ విద్యపై ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. అనంతరం వద్ధాశ్రమంలో వద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డా.అపర్ణ, డా. విజయకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-పెదపారుపూడి: వేసవికాలంలో విద్యార్థులకు విబిఎస్ ద్వారా జ్ఞానం పెంపొందించబడుతుందని మేజర్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెదపారుపూడి రక్షణ సైన్య దేవాలయంలో విబిఎస్ క్లాసులు నిర్వహించారు. విజయ కుమార్ మాట్లాడుతూ బైబిల్ లో ఉన్న నీతి కథలను ద్వారా జ్ఞానం పెంపొందించబడుతుందన్నారు అనంతరం వంద మంది విద్యార్థులకు బహుమతుల అందజేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ రూతుకుమారి సంఘ పెద్దలు నత్తభూషణ్ కుమార్, చొక్కా రమేష్, పీక పద్మ, గుమ్మడి ఏసు, మరియమ్మ, సండే స్కూల్ టీచర్లు అత్త సోనియా, ఖమ్మం జీవనప్రియ, అనూష పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్స్ పాల్ తలశిల దామోదర్ అన్నారు.ఆదివారం పరాసుపేట సెంటర్ లో ని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ బాలికల ఉచిత హాస్టల్ లో ని విద్యార్థులకు చలమలశెట్టి బాలాజీ రూ 10 వేలు విలువ గల నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు, మచిలీపట్నం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాయికష్ణ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో అడపాల నరసింహరాజు విద్యార్థులకు బియ్యం మామిడి పళ్ళు, ముంజెలు,పనస తొనలు అందచేశారు.ఈ కార్యక్రమంలో సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ముదిగొండ శాస్త్రి,సేవా సంస్థ ప్రతినిధులు కాపవరపు చంద్రశేఖర్ ,పివి ఫణికుమార్,చిట్టూరి మురళీకష్ణ,కళ్యాణి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

60 మంది విద్యార్థులకు సన్మానం



ప్రజాశక్తి-అవనిగడ్డ

మాజీ ఉపసభాపతి అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం జనసేన అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ 68వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన 60 మంది విద్యార్థులను సత్కరించడంతో పాటు వారికి నగదు బహుమతులు కూడా అందజేశారు. ఆదివారం గాంధీ క్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెనాలి మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభతో ఎదగాలని ఇంటర్ క్లిష్ట సమయమని క్రమశిక్షణతో విజయం సాధించాలన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు తమ కళ్ళ ముందు కనిపించే రంగుల ప్రపంచం మాయలో పడకుండా ఇంటర్మీడియట్ అనే రెండేళ్ల దశను క్రమశిక్షణతో దాటితే ఇక వెనుతిరిగి చూసే పరిస్థితి రాదన్నారు. తల్లిదండ్రులు పడే కష్టనష్టాలను చూస్తూ చదువుకున్న గ్రామీణ విద్యార్థులు భవిష్యత్తులో ఎలాంటి క్లిష్ట పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉంటారన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ అనే మధ్య దశను దాటి మంచి భవిష్యత్తు పొందాలని కోరారు. అహింస సిద్ధాంతంతో స్వాతంత్ర పోరాటంలో విజయం సాధించిన మహాత్మా గాంధీ బాటలో అవనిగడ్డలో మండలి బుద్ధ ప్రసాద్ గాంధీయవాదాన్ని అనుసరిస్తూ స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారని ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కనకని బెణకని స్థితప్రజ్ఞత కలిగిన నాయకుడు బుద్ధప్రసాద్ అని కొనియాడారు. వివాద రైతునిగా రాజకీయ జీవితం కొనసాగిస్తున్న బుద్ధ ప్రసాద్ ఆదర్శనీయులన్నారు. బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పెద్ద ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యావంతులు కావాలని తద్వారా ఉజ్వల భవిష్యత్తు పొందాలని ఆశీస్సులు అందించారు. తొలుత 60 మంది విద్యార్థులను శాలువలు తో సత్కరించి నగదు బహుమతులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్ రామ్, గుడిసేవ విష్ణు ప్రసాద్, మాజీ జెడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు బండే రాఘవ, బచ్చు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఐసిఐసిఐ ప్రు ప్లాటినమ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : డిస్ట్రిబ్యూటర్లకు వారి కస్టమర్ల ఫండ్ వేల్యూ ఆధారంగా చెల్లింపులు జరిపే విధానంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ తమ తొలి యూనిట్ లింక్డ్ ప్రోడక్ట్ అయిన ఐసీఐసీఐ ప్రు ప్లాటినంను ఆవిష్కరించినట్లు సంస్థ ప్రతినిధి ఎం.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానంలో డిస్ట్రిబ్యూటర్లకు వారి కస్టమర్ల అసెట్స్‌ను బట్టి కమీషన్లు చెల్లించబడతాయన్నారు. పాలసీ వ్యవధి ఆసాంతం పెట్టుబడులను కొనసాగించేలా కస్టమర్లను ప్రోత్సహించేలా డిస్ట్రిబ్యూటర్లకు ఈ విశిష్టమైన ఉత్పత్తి ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. దీర్ఘకాలంలో సంపదను పెంచుకునేందుకు వ్యయాలు, పన్నులపరంగా ఇది కస్టమర్లకు అనువైన మార్గంగా ఉంటుందన్నారు. ఎటువంటి వ్యయాలు లేదా పన్నులపరమైన భారాలు లేకుండా కస్టమర్లు వివిధ అసెట్ క్లాస్‌లకు ఉచితంగా ఎన్నిసార్లయినా మారే సౌలభ్యాన్ని ఐసిఐసిఐ ప్రు ప్లాటినం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రోడక్ట్ కింద కస్టమర్లు 21 ఫండ్స్ నుంచి దేన్నయినా ఎంచుకోవచ్చన్నారు. వీటిలో ఈక్విటీకి సంబంధించి 13, డెట్, బ్యాలెన్స్‌డ్ కేటగిరీల్లో నాలుగు ఫండ్స్ ఉన్నాయన్నారు. నాలుగు పోర్ట్‌ఫోలియో వ్యూహాల ఆప్షన్లు ఉన్నాయని తెలిపారు.



రాష్ట్ర స్థాయి గుర్తింపుతో అగ్రభాగాన 'శ్రీచైతన్య'

ప్రజాశక్తి - నందిగామ :

ఉత్తమ ఫలితాలు సాధిస్తూ రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన శ్రీ చైతన్య విద్యా సంస్థలు అగ్ర భాగంలో దూసుకుపోతున్నాయని నందిగామ చైతన్య కాలేజి ఎసి క్యాంపస్ ప్రిన్సిపాల్ అమరనేని కార్తీక్, మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ అమరనేని రమేష్ బాబు తెలిపారు. ప్రజాశక్తి చదువు శీర్షిక కు వారు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్మీడియట్, ఎంసెట్, జెఇఇ మెయిన్స్, తెలంగాణ ఎంసెట్ ఫలితాలలో చైతన్య కాలేజి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాదించి రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉన్నారని తెలిపారు. నందిగామ ప్రాంతంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు విజయవాడ వెళ్ళే అవసరం లేకుండా ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఐఐటీ, జెఇఇ, నీట్ కోర్సులను అందిస్తున్నామని వివరించారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సొంత యాజమాన్యం పర్యవేక్షణలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కలదని, విశాలమైన ప్రాంగణంలో ఆటస్థలం, లేబరేటరీ సౌకర్యం, కంప్యూటర్ ల్యాబ్, మినరల్ వాటర్ సౌకర్యం ఉందని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలోనే తమ విద్యా సంస్థలు ఏటేటా అత్యుత్తమ విద్యా ప్రమాణాల సాధనలో ప్రథమస్థానంలో ఉందన్నారు. విద్యార్థులకు ఆల్ రౌండ్ డెవలప్మెంట్ కోసం నిరంతరం పని చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షలు ఏదైనా అత్యధిక ఫలితాలు చైతన్య కాలేజి విద్యార్థులకే దక్కుతాయని తెలిపారు. అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు.



'పివిఆర్ మల్టీ స్పెషాలిటీ'లో

ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను పటమటలోని యాదవుల బజారులో ఉన్న పి.వి.ఆర్. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రారంభించినట్లు హాస్పిటల్ అడ్వైజర్, మెడికల్ కౌన్సిల్ అఫ్ ఇండియా మాజీ మెంబెర్ డాక్టర్ సి.ఎల్.వెంకటరావు తెలిపారు. ఆదివారం హాస్పిటల్‌లో జరిగిన కార్యక్రమంలో వై.ఎస్.ఆర్. ఆరోగ్యశ్రీ సేవలను ముఖ్య అతిథులుగా పాల్గొన్న విశ్రాంత అధికారి ఎస్.బి.వి.రమణకుమార్, పూర్వపు ప్రిన్సిపాల్ సెక్రటరీ బి.ఉదయలక్ష్మి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అనంతరం ఉదయలక్ష్మి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, పేద, మధ్య తరగతి వర్గాల వారికి డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఒక వరం అని ప్రశంసించారు. ఇకపై పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా సూపర్ స్పెషాలిటీ సేవలు ఉచితంగా లభిస్తాయని, స్వతహాగా డాక్టర్ పీవీఆర్ చౌదరి హాస్పిటల్ ప్రారంభం నుండి అందరికి అందుబాటులో వైద్యసేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. తమ హాస్పిటల్‌లో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నామని భవిష్యత్తులో పేదల కోసం తక్కువ వ్యయంతో వైద్యసేవలు అందిస్తామని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.ఆర్.చౌదరి తెలిపారు. కార్యక్రమంలో విజయ ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సెస్ చైర్మన్ తట్టి అర్జునరావు, హాస్పిటల్ సీఈవో, ప్రముఖ న్యూరో సర్జన్ పువ్వాడ రామకష్ణ, పలువురు రాజకీయ నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉదయలక్ష్మి

ప్రజల సమస్యలపై పాలకులు నిర్లక్ష్యం : బాబూరావు

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : అధికార ప్రతిపక్షాలు పార్టీలు ఎలక్షన్లో ప్రజలకు అనేక వాగ్దానాలు చేశారని ఫలితాలు రాకముందే ప్రజలను గాలికి వదిలేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. అధికార ప్రతిపక్ష నాయకులు పార్టీలు గెలుపు ఓటములపై లెక్కలు వేస్తున్నారని ప్రజలు పట్టించుకోవటం లేదని అన్నారు. 62వ డివిజన్ ప్రకాష్ నగర్‌లో బాబూరావు ప్రజలకు ఇంటింటికి వెళ్ళి తమకు మద్దతు తెలిపిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అధికారులు ఎలక్షన్ కోడ్ పేరుతో తప్పించుకుంటున్నారని ప్రజా సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు ఎల్‌బిఎస్ నగర్‌లో అండర్ డ్రైనేజీ పొంగిపొర్లుతున్న పట్టించుకునే నాధుడే లేరని ప్రభుత్వ అధికారులు ఎన్నికల కోడ్ ఉందని చెప్పి తప్పించుకుంటున్నారని ఎన్నికల కోడ్ ప్రజా సమస్యలకు సంబంధమేంటని ప్రశ్నించారు. ప్రజల అవసరాలు పట్టవు గానీ ఓట్లు మాత్రం కావాలని ఎద్దేవా చేశారు. ఎలక్షన్ కమిషన్ ఎలక్షన్లో కోట్ల రూపాయలు పంపిణీ జరిగితే చోద్యం చూశారన్నారు. పట్టపగలు కోట్ల రూపాయలు చేతులు మారాయని ఎలక్షన్ కమిషన్ మాత్రం కేంద్ర ప్రభుత్వానికి దాసోహం అయిందని అన్నారు అవినీతి అంతం చేస్తాం అని చెప్పుకునే బిజెపికి ఎలక్షన్ కమిషన్ తోడై ఉండటంతో ఎలక్షన్లో కోట్ల రూపాయలు పంపిణీ జరిగిందన్నారు. నగరంలో మంచినీళ్ల సరిగ్గా రావటం లేదని వచ్చిన నీరు కూడా మురికి నీరు వస్తుందని దానిని పట్టించుకోని పరిస్థితి లేదని అన్నారు. కేంద్రంలో బిజెపి పతనం మొదలైందని బిజెపికి రాష్ట్రంలో టిడిపి, వైసిపిలు మద్దతు పలకటం దారుణం అన్నారు ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, అధ్యక్షులు కె.దుర్గారావు డివిజన్ ఇన్‌చార్జ్‌లు నాగేశ్వరావు ఎస్‌కె పేరు పి.సాంబిరెడ్డి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న బాబూరావు


వివరాలడుగుతున్న సిఐ హనీష్

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ :

నందిగామ పట్టణంలో లాడ్జి లను శనివారం రాత్రి నందిగామ సీఐ హనీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజయవాడ సిటీ కమిషనర్ ఉత్తర్వుల మేరకు సీఐ హనీష్, ఎస్ఐ పండు దొర సిబ్బందితో కలిసి నందిగామ పట్టణంలోని లాడ్జిలను పరిశీలించారు. లాడ్జ్ ఓనర్స్‌తో కొత్తగా ఎవరైనా వస్తే వారికీ సంబంధించిన పూర్తి వివరాలు తీసుకోని రూమ్స్ ఇవ్వాలని సూచించారు.

దుక్కులు దున్నితే అధిక దిగుబడులు

- తొలకరి జల్లుల తర్వాత గొర్రెలు తిప్పి సేద్యం చేయాలి
- వేసవిలోనే దుక్కులు దున్నుకోవడం రైతులకు ఎంతో ప్రయోజనం



ప్రజాశక్తి - వీరులపాడు :

వీరులపాడు మండలంలోని పలు గ్రామాల రైతులు వేసవి దుక్కులు ప్రారంభించారు. సాధారణంగా కొంతమంది రైతులు వేసవి పంటలు కోసిన తర్వాత దుక్కులు దున్నుకోకుండా ఉండడం వల్ల ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలకు తగిన మొత్తంలో పోషక లభ్యత ఉండదు. రైతుల ఆశించిన పంట దిగుబడి పొందలేరు. దీని నివారణకు గానూ వేసవిలోనే దున్నుకోవడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు రైతులకు చెబుతున్నారు.

దుక్కులు లోతుగా దున్నాలి

మరో 40 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో నందిగామ మరియు మెట్ట ప్రాంతంలో రైతులు గ్రామాల్లో కొందరు రైతులు తమ పొలాల్లో దుక్కులు దున్నుకోవడం ఈ సమయంలో పంట పొలాల్లో దుక్కి దున్నడం చేయడం వల్ల నేల స్థూలం సాంద్రత తగ్గటం జరుగుతుంది నెలలో గాలి ప్రసరించి గుణం పెరుగుతుంది లోపల పొరల్లో ఉన్న పోషకాలు నేల ఉపరితలానికి చేరిన తర్వాత పంటలకు లభ్యత పెరుగుతుంది. లోతుగా దున్నుకోవడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూలంగా ఉండటంతో పాటు భూమి ఎక్కువగా తేమను గ్రహించి నిల్వ చేసుకొని సామర్థ్యం పెరుగుతుంది. దీని ప్రభావం తర్వాత పంటల దిగుబడిపై చూపుతుంది. పంట కోత అనంతర సేంద్రియ కార్బన్ అభివృద్ధి చెందుతుంది. భూసారం అభివృద్ధి చెందుతుంది. దీని ద్వారా నేలల్లో సూక్ష్మ జీవుల సంఖ్య పెరుగుతుంది. తర్వాత పంట వేసిన తర్వాత ఎరువులు వినియోగంతో సామర్థ్యం పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది. వేసవిలో లోతుగా దుక్కులు దున్ని తొలకరి జల్లులు కురిసిన తర్వాత గొర్రెలు మందను తిప్పి సేద్యం చేస్తే పైరు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు గుంటక నాగలి వంటి పరికరాలు నేల లోపలికి మూడు నుంచి 6 అంగుళాలు వరకు భూమి లోతులో తరచూ ఉపయోగించడం వల్ల నేల లోపల సుమారు మూడు నుంచి ఐదు అంగుళాల్లోతు ఒక గట్టి పొర ఏర్పడుతుంది. దీంతో నేలకి నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. కావున వేసవి దుక్కుల సమయంలో నేలను లోతుగా దున్నుకోవడం నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది. తుంగ గరిక వంటి మొండి జాతి కలుపు మొక్కలు పొలంలో అధికంగా పెరిగే పంటలను నాశనం చేస్తూ ఉంటాయి. కానీ వేసవిలో దుక్కులు లోతుగా తీయడంతో పొలాల్లోనే చీడపురుగులు నాశనం అయ్యే అవకాశం ఉన్నందువల్ల రైతులు అధికారుల సూచన మేరకు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. పంటల కోతల తర్వాత నేలపై మిగిలే పంట మొదలు పొలంలో మిగిలి కలుపు మొక్కలు పంటల నుంచి రాలి పడిన ఆకుల మీద సేంద్రియాల లోతులో దున్నినప్పుడు నేలలో కలిసిపోయి ఎరువులుగా మారుతాయి. దీనితో సేంద్రియ పదార్థాలు పోషక విలువలు పెరగడానికి అవకాశం ఉంటుంది. లోతుగా దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటే వానా కాలానికి ఎంతో అనుకూ లంగా ఉంటుం దని వ్యవసాయ అధి కారు లు చెబుతున్నారు.

మండలంలోని జుజ్జూరు గ్రామానికి చెందిన పరిటాల రాజు నేను నా సొంత భూమితో పాటు పది ఎకరాలు కవులు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాను. పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాను. వేసవి దుక్కులు మాకు పంట దిగుబడి రావటానికి చాలా ప్రయోజనకరంగా ఉంటున్నాయి. వేసవి దుక్కులతోపాటు గ్రామాల్లో ఉన్న గొర్రెల మందను ఖరీఫ్ చేయడానికంటే ముందుగా పెంట పెట్టించడం వల్ల దిగుబడి పెరుగుతుంది. రైతులతో పాటు గొర్రెల పెంపకదారులకి ఆదాయం వస్తుంది.

